# కట్నం అడగకున్నా 498ఏ వర్తిస్తుంది

- 'క్రూరత్వం' కింద నేరాన్ని నిర్ధారించేందుకు వరకట్నమే అడగాల్సిన అవసరం లేదు
- ఎలాంటి హాని తలపెట్టినా ఆ సెక్షన్ వర్తిస్తుంది
- ఐపీసీ సెక్షన్ 498ఏపై సుప్రీంకోర్టు తీర్పు



న్యూఢిల్లీ: వరకట్న వేధింపుల నిషేధ చట్టంగా పేరొందిన ఐపీసీ సెక్షన్ 498ఏకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సెక్షన్ కింద నేరం రుజువు చేసేందుకు భర్త వరకట్నం డిమాండ్ చేయాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది. వివాహిత పట్ల ఏ రకంగా క్రూరత్వం చూపినా ఈ చట్టం వర్తిస్తుందని పేర్కొన్నది. వరకట్నం కోసం డిమాండ్ చేయలేదనే కారణంతో ఓ వ్యక్తిపై నమోదైన 498ఏ కేసును ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ వివాహిత దాఖలు చేసిన పిటిషన్‌ను తాజాగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బీ వరాలేతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. 'ఏ రకమైన క్రూరత్వం చూపించినా లేదా వరకట్నం డిమాండ్ చేసినా ఐపీసీ సెక్షన్ 498ఏ వర్తిస్తుంది. శిక్షార్హమైన నేరం అవుతుంది' అని ధర్మాసనం స్పష్టం చేసింది. 'మానసికంగా లేదా శారీరకంగా హాని తలపెట్టేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రవర్తించినా(క్లాజ్ ఏ) లేదా మహిళ, ఆమె కుటుంబాన్ని చట్టవిరుద్ధమైన డిమాండ్‌ను నెరవేర్చమని వేధించినా(క్లాజ్ బీ) సెక్షన్ 498ఏ వర్తిస్తుంది' అని పేర్కొన్నది. 'వరకట్న వేధింపుల వల్ల మరణాలతో పాటు వివాహిత మహిళపై అత్తింటివారి వేధింపుల కేసులను సమర్థంగా ఎదుర్కోవడానికి ఈ చట్టం వచ్చింది' అని పార్లమెంటును ఉటంకిస్తూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది.

# అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం?

- యూఎస్ఏఐడీ నిధుల అంశం కలవరపెడుతున్నది
- ఆందోళన వ్యక్తం చేసిన భారత విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: భారత్‌లో పలు కార్యకలాపాలను యూఎస్ఏఐడీ నిధులు వెచ్చించినట్టు వస్తున్న సమాచారం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. 'యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవెలప్‌మెంట్(యూఎస్ఏఐడీ) కార్యకలాపాలు, నిధులకు సంబంధించి అమెరికా యంత్రాంగం బహిర్గతం చేసిన సమాచారం చూశాం. ఇది కచ్చితంగా తీవ్ర కలవరపాటుకు గురిచేసే అంశమే. భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యానికి సంబంధించి ఆందోళనలకు ఇది దారితీసింది. ఈ వ్యవహారాన్ని సంబంధిత విభాగాలు, ఏజెన్సీలు పరిశీలిస్తున్నాయి. ఇప్పుడే ఈ విషయంపై బహిరంగ వ్యాఖ్యలు చేయడం సరికాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, భారత్‌లో పోలింగ్‌ను పెంచేందుకు కేటాయించినట్టుగా డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం చెప్తున్న రూ.181 కోట్లు నిజానికి 2022లో యూఎస్ఏఐడీ బంగ్లాదేశ్ ఎన్నికల కోసం కేటాయించిందని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం ప్రచురించింది.

**రాహుల్ గాంధీ దేశ ద్రోహి: బీజేపీ**

నిధులు బంగ్లాదేశ్‌కు వెళ్లాయనే వార్తలను బీజేపీ ఖండించింది. ట్రంప్ కంటే ఎక్కువగా ఈ వ్యవహారం ఎవరికీ తెలియదని, కావాలనే ఈ అంశాన్ని కప్పిపుచ్చేందుకు ఇలాంటి వార్తలు వస్తున్నాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 'రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సమయంలో భారత ప్రభుత్వానికి నిధులు ఆగిపోయి ఎన్జీవోలకు పెరిగాయి. లోక్‌సభ ఎన్నికల్లో మోదీని ఓడించే ప్రయత్నంలో భాగంగా ఎన్నికల ముందు రాహుల్ గాంధీని బలోపేతం చేసేందుకే ఈ నిధులు వచ్చాయి. రాహుల్ గాంధీ దేశద్రోహి. ఆయన చేపట్టిన భారత్ జోడో యాత్ర లక్ష్యం.. భారత్‌ను ముక్కలు చేయడమే' అని ఆరోపించారు. యూఎస్ఏఐడీ నిధులు బంగ్లాదేశ్‌కు వెళ్లాయనే వార్తల నేపథ్యంలో బీజేపీ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు.

# పీపీపీ మంచిదే!

## ప్రపంచవ్యాప్తంగా పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానం నడుస్తోంది

- సుపరిపాలనలో భాగంగా దీన్ని సమర్థించాలి
- 'చెన్నై ఫార్ములా-4 రేసింగ్' కేసులో సుప్రీంకోర్టు
- సర్కారు, ప్రైవేటు సంస్థకు మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీల్లో జోక్యమేంటని హైకోర్టుపై అసహనం
- మద్రాస్ హైకోర్టు ఆదేశాలను పక్కనపెడుతూ తీర్పు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పరిమితంగా ఉన్న వనరుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రభుత్వాలు.. ప్రైవేటు సంస్థలతో కలిసి పనిచేయడాన్ని ఆహ్వానించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తెలిపింది. సుపరిపాలనలో భాగంగా ప్రపంచమంతటా వివిధ దేశాలు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాలను (పీపీపీ విధానాన్ని) ప్రోత్సహిస్తున్నాయన్న విషయాన్ని గుర్తు చేసింది. ప్రభుత్వ సేవలు, మౌలిక సదుపాయ ప్రాజెక్టులను ప్రైవేటు భాగస్వామ్యాల ద్వారా అమలు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలను రాబట్టవచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. ఫార్ములా-4 రేసులతోపాటు ఇతర మోటర్ స్పోర్ట్స్‌ను తమిళనాడు ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రైవేటు సంస్థలను భాగస్వాములను చేయరాదని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. ఈ మేరకు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం పలు కీలక వ్యాఖ్యలు చేసింది.



**ఏమిటీ కేసు?**

2023 డిసెంబర్ 8, 10 తేదీల్లో చెన్నై నగరంలో ఫార్ములా-4 రేసులను నిర్వహించబోతున్నట్టు తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు 2023 నవంబర్ 2న నోటిఫికేషన్ జారీ చేసింది. రేసింగ్ ప్రమోషన్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్పీపీఎల్) అనే ప్రైవేటు సంస్థతో కలిసి తమిళనాడు క్రీడాభివృద్ధి సంస్థ (ఎస్డీఏటీ) ఈ రేసును నిర్వహించబోతున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు ఇరువురి మధ్య 2023 ఆగస్టులో ఎంవోయూ కుదిరినట్టు వివరించింది. ఈ ఎంవోయూ మేరకు ఫార్ములా-4 రేసులను నిర్వహించారు. మూడేండ్ల వ్యవధి కోసం కుదిరిన ఎంవోయూ ప్రకారం ఆర్పీపీఎల్ తన బాధ్యతగా రూ.202 కోట్లను వ్యయం చేయనుండగా, లైసెన్స్, ఆపరేషన్స్ ఫీజు, రోడ్లు, ఇతరత్రా అవసరాల కోసం ఎస్డీఏటీ రూ.42 కోట్లు వెచ్చించాల్సి ఉంది. అయితే చెన్నైలో ఫార్ములా-4 రేసులు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ మద్రాస్ హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి.

**పిల్స్‌లో అభ్యంతరాలు ఇవి..**

ఫార్ములా-4 రేసుల వల్ల ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని, భద్రతాపరమైన అంశాలు తలెత్తుతున్నాయని, ధ్వని కాలుష్యం ఏర్పడుతుందని పిటిషనర్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రైవేటుగా నిర్వహించే కార్యక్రమానికి ప్రజాధనాన్ని వెచ్చించడంలో పారదర్శకత లోపిస్తున్నదని ఆరోపించారు. దీంతో డిసెంబర్‌లో జరగాల్సిన రేసులు వాయిదాపడ్డాయి.

**హైకోర్టు ఆదేశాలు ఇవి..**

దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై కిందటేడాది ఫిబ్రవరి 19న మద్రాస్ హైకోర్టులో విచారణ జరిగింది. రేసుల నిర్వహణకు హైకోర్టు అనుమతినిచ్చినప్పటికీ పలు షరతులను విధించింది. తమిళనాడు ప్రభుత్వం వెచ్చించిన రూ.42 కోట్లను, భవిష్యత్తులో నిర్వహించబోయే రేసుల కోసం అడ్వాన్స్ డిపాజిట్‌గా చెల్లించిన రూ.15 కోట్లను ఆర్పీపీఎల్ తిరిగిచ్చేయాలని ఆదేశించింది. రానున్న సంవత్సరాల్లో ఈ రేసులను ప్రభుత్వమే నిర్వహించాలని కూడా సూచించింది. ఇలా నాలుగు ఆదేశాలను ఇచ్చింది. మద్రాస్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆర్పీపీఎల్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

**సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

- పరిమితంగా ఉన్న వనరులను, సామర్థ్యాన్ని, నైపుణ్యతను పెంచుకోవడానికి ప్రభుత్వాలు.. ప్రైవేటు సంస్థలతో కలిసి పీపీపీ విధానాన్ని అవలంబిస్తున్నాయి. దీన్ని ఆహ్వానించాల్సిందే.
- సుపరిపాలనలో భాగంగా ప్రపంచమంతటా వివిధ దేశాలు పీపీపీ విధానాన్ని ప్రోత్సహిస్తున్నాయి.
- ప్రభుత్వ సేవలు, మౌలిక సదుపాయ ప్రాజెక్టులను ప్రైవేటు భాగస్వామ్యాల ద్వారా అమలు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలను రాబట్టవచ్చు. పీపీపీ వల్ల సామర్థ్యం, నైపుణ్యత పెంపొందుతుందని గమనించాలి.
- ఫార్ములా-4 రేసు నిర్వహణను మద్రాస్ హైకోర్టు గతంలోనే అనుమతించింది. అలాంటప్పుడు పీపీపీలో భాగంగా కుదిరిన ఫార్ములా-4 రేసు ఎంవోయూలోని నిబంధనల్లో, ముఖ్యంగా ఆర్థిక లావాదేవీల్లో అదే కోర్టు జోక్యం చేసుకోవడం.. న్యాయవ్యవస్థ తన పరిధిని దాటడమే.
- ఫార్ములా-4 రేసును ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రైవేటు సంస్థలను భాగస్వాములను చేయరాదన్న హైకోర్టు తీర్పుతో మేము విభేదిస్తున్నాము. ఈ మేరకు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన నాలుగు ఆదేశాలను పక్కనబెడుతున్నాం.

> "ప్రపంచమంతటా పలు దేశాలు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తున్నాయి. సుపరిపాలనలో భాగంగా పీపీపీ విధానాన్ని సమర్థించాల్సిందే. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో భాగంగా కుదిరిన ఎంవోయూలోని నిబంధనల్లో, అదీ ముఖ్యంగా ఆర్థిక లావాదేవీల్లో మద్రాస్ హైకోర్టు జోక్యం చేసుకోవడం.. న్యాయవ్యవస్థ తన పరిధిని దాటడమే అవుతుంది.
>
> -విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

# గుండెజబ్బుల ముప్పు తగ్గించే బియ్యం

## జన్యుమార్పులతో అభివృద్ధి చేసిన చైనా పరిశోధకులు

*బీజింగ్, ఫిబ్రవరి 21: గుండె జబ్బుల ముప్పు తగ్గించే బియ్యం, గోధుమల రకాలను అభివృద్ధి చేశారు చైనా పరిశోధకులు. జన్యు మార్పులతో చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్(సీఏఎస్)కు చెందిన పరిశోధక బృందం తయారుచేసిన ఈ కొత్త వరి, గోధుమ వంగడాలకు సంబంధించిన వివరాలు 'సెల్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. గుండె జబ్బుల ముప్పును తగ్గించే కోఎన్‌జైమ్ క్యూ10 అనే రకమైన యాంటీఆక్సిడెంట్‌ను ఈ వరి, గోధుమ రకాలు కలిగి ఉంటాయని పరిశోధకులు తెలిపారు. సీఓక్యూ10, యుబిక్వినోన్ అని కూడా పిలిచే ఈ యాంటీఆక్సిడెంట్‌ను మానవ శరీరం సహజంగానే ఉత్పత్తి చేస్తుందని, వయసు పెరుగే కొద్దీ, శరీరంలో దీని ఉత్పత్తి తగ్గిపోయి, గుండెజబ్బుల ముప్పు పెరుగుతుందని చెప్పారు. కూరగాయలు, చేపలు, మాంసం, గింజల్లో సీఓక్యూ10 సహజంగా లభిస్తుందని, బియ్యం, గోధుమలు, ఓట్స్‌లో మాత్రం సీఓక్యూ9 అనే మరో రకమైన యాంటీఆక్సిడెంట్ ఉంటుందని తెలిపారు. సీఓక్యూ10 ఇచ్చే ప్రయోజనాలను సీఓక్యూ9 ఇవ్వదని చెప్పారు. 134 రకాల వరి, గోధుమ వంగడాలపై అధ్యయనం చేసిన తర్వాత, సీఓక్యూ10 ఉత్పత్తి చేసేలా జన్యుపరమైన మార్పులు చేసిన కొత్త రకాలను అభివృద్ధి చేసినట్టు తెలిపారు.*



# ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్

## అమెరికన్ సెనేట్ ఆమోదం

న్యూయార్క్: అమెరికాకు చెందిన అత్యున్నత దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ నూతన డైరెక్టర్‌గా మొట్టమొదటిసారి భారతీయ-అమెరికన్ కాష్ పటేల్ నియమితులయ్యారు. ఆయన నియామకానికి అమెరికన్ సెనేట్ నుంచి గురువారం ఆమోదం లభించింది. పటేల్ నియామకానికి అనుకూలంగా 51, వ్యతిరేకంగా 49 ఓట్లు వచ్చాయి. తన నియామకానికి సెనేట్ ధ్రువీకరణ లభించిన సందర్భంగా కాష్ పటేల్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ ఎఫ్‌బీఐ పట్ల విశ్వాసాన్ని పెంపొందించడానికి కృషి చేస్తానని ప్రకటించారు. ఎఫ్‌బీఐ 9వ డైరెక్టర్‌గా తనను నియమించినందుకు అధ్యక్షుడు ట్రంప్, అటార్నీ జనరల్ బాండీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అమెరికన్లకు హాని తలపెట్టాలని భావించే వారిని వేటాడతానని ఆయన హెచ్చరించారు.

# యూపీఐతో పీఎఫ్ సొమ్ము విత్‌డ్రా

## త్వరలో అందుబాటులోకి కొత్త సదుపాయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: యూపీఐ ద్వారా పీఎఫ్ సొమ్మును విత్‌డ్రా చేసుకునే కొత్త సదుపాయాన్ని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) అందుబాటులోకి తీసుకురానున్నది. ఇందుకోసం నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)తో ఈపీఎఫ్ఓ చర్చలు జరుపుతున్నది. 2-3 నెలల్లో ఈ సదుపాయాన్ని ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఈపీఎఫ్ఓ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటివరకు ఖాతాదారుల క్లెయిమ్ సెటిల్ అయిన తర్వాత బ్యాంకు అకౌంట్‌లకు డబ్బులు వచ్చేవి. దీనికి రెండు మూడు రోజులు పట్టేది. కొత్త విధానం అందుబాటులోకి వస్తే ఫోన్‌పే, జీపే, పేటీఎం వంటి యూపీఐ ప్లాట్‌ఫామ్‌ల ఐడీకే పీఎఫ్ సొమ్ము వస్తుంది. దీంతో క్లెయిమ్ సెటిల్ అయిన వెంటనే ఖాతాదారులకు డబ్బులు అందుతాయి.




# పిల్లలు చనిపోతుంటే ఫొటో షూట్‌లా?

## జెలెన్‌స్కీపై విరుచుకుపడ్డ మస్క్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పిల్లలు యుద్ధ భూమిలో చనిపోతుంటే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భార్యతో కలిసి వోగ్ మ్యాగజైన్ కవర్‌పేజీ కోసం ఫొటోషూట్ చేశారని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ విరుచుకుపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో అందుకు సంబంధించిన కవర్‌పేజీ ఫొటో(జూలై 2022) షేర్ చేస్తూ జెలెన్‌స్కీపై పలు విమర్శలు చేశారు. ఉక్రెయిన్ మీద జెలెన్‌స్కీకి ప్రేమ లేదని ఆరోపించారు. ఆయన ఆ దేశ సైనికులను యుద్ధంలో సమిధలుగా మారుస్తున్నారని విమర్శించారు.

# జ్ఞాపకశక్తిలో మనోడే ప్రపంచ ఛాంపియన్

## 13.50 సెకన్లలో 80 అంకెలు జ్ఞప్తిలోకి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పుదుచ్చేరిలోని మనకుల వినయగర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థి విశ్వ రాజ్‌కుమార్(20) ప్రపంచ జ్ఞాపక శక్తి లీగ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. ఆన్‌లైన్‌లో జరిగిన ఈ పోటీల్లో కేవలం 13.50 సెకన్లలో 80 అంకెలను జ్ఞప్తికి తెచ్చుకొని సహ పోటీదారులను అవాక్కయ్యేలా చేశాడు. ఇందులో యాదృచ్ఛికంగా తెరపై ప్రదర్శించిన 80 అంకెలను వీలైనంత త్వరగా తిరిగి గుర్తుకు తెచ్చుకోవాలి. వాటిని 100% కచ్చితత్వంతో రీకాల్ షీట్‌లో నమోదు చేయాలి. రాజ్‌కుమార్ ఈ లక్ష్యాన్ని రికార్డు వేగంతో పూర్తి చేయడంతో పాటు 30 చిత్రాలను కేవలం 8.40 సెకన్లలో తిరిగి గుర్తు చేసుకున్నాడు.



# కర్ణాటక ప్రజలపై మరో ధరల పిడుగు

## నందిని పాల ధర రూ. 5 పెంపు

## కాంగ్రెస్ సర్కారు యోచన

బెంగళూరు: కర్ణాటక ప్రజలపై మరో ధరల పిడుగు పడనుంది. అధికారం చేపట్టినప్పటి నుంచి ధరలు పెంచుతూ ప్రజలపై భారం మోపడమే ధ్యేయంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి నందిని పాల ధరను పెంచాలని నిర్ణయించింది. లీటర్ పాలపై రూ.5 పెంచాలని కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ ప్రతిపాదించింది. ప్రభుత్వం ఆమోదం తెలిపితే, రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే మార్చి 7 తర్వాత నుంచి ఇది అమలులోకి రానుంది. పాల ప్యాకెట్ సైజ్‌ను 1050 ఎంఎల్ నుంచి లీటర్‌కు తగ్గించనున్నట్టు ఫెడరేషన్ ప్రకటించింది. కొత్త ధర అమలులోకి వస్తే టోన్డ్ మిల్క్ ప్రస్తుతమున్న రూ.44 నుంచి 47కు పెరుగుతుంది. గత మూడేండ్లలో కేఎంఎఫ్ ధరల పెంపులో ఇదే అత్యధికం. నందిని పాల ధరల పెంపు ప్రతిపాదనపై కర్ణాటక లెజిస్లేటివ్ కౌన్సిల్ విపక్ష నేత నారాయణ స్వామి తీవ్రంగా నిరసించారు.

# దేవుడు కూడా ఏం చేయలేడు

- రెండుమూడేండ్లలో పరిష్కరించలేడు
- బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్ దుస్థితిపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్
- డీకే వ్యాఖ్యలపై మండిపడ్డ బీజేపీ





బెంగళూరు: బెంగళూరు రోడ్ల సమస్యను దేవుడు కూడా పరిష్కరించలేడని కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ పేర్కొన్నారు. గురువారం బెంగళూరులో ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నగరంలో రోడ్లు, ట్రాఫిక్ దుస్థితిపై ఆయన స్పందిస్తూ.. 'బెంగళూరులో 1.40 కోట్ల జనాభా, 1.10 కోట్ల వాహనాలు ఉన్నాయి. దేవుడే దిగివచ్చినా రెండుమూడేండ్లలో సమస్యను పరిష్కరించలేడు. ఇది చాలా కష్టమైనది. సరైన ప్రణాళికలు రూపొందించి, ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంది' అని వ్యాఖ్యానించారు. డీకే వ్యాఖ్యలను హోంమంత్రి పరమేశ్వర సైతం సమర్థించారు. 'బెంగళూరులో మౌలిక వసతుల కొరత ఉందని అందరికీ తెలుసు. ఇంత మంది జనాభా, వాహనాలకు తగ్గట్టుగా బెంగళూరు నిర్మాణం జరగలేదు. కొత్త మౌలిక సదుపాయాలు కల్పించనంతకాలం ట్రాఫిక్ అతిపెద్ద సవాల్‌గా ఉంటుంది' అని పరమేశ్వర వ్యాఖ్యానించారు.

**చేతగాకపోతే దిగిపో: బీజేపీ**

డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష నేత ఆర్ అశోక మండిపడ్డారు. 'బెంగళూరు నగరాన్ని డీకే తన సొంత కోరికలకు నిధులు సమకూర్చే ఆవుగా భావిస్తారు. నగరంలో ప్రజా సమస్యలను పరిష్కరించే బాధ్యతను డీకే శివకుమార్ తీసుకోలేకపోతే పదవి నుంచి దిగిపోయి సమర్థులైన వారికి అప్పగించాలి' అని అశోక 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కర్ణాటకకు, బెంగళూరుకు కాంగ్రెస్ పార్టీ శాపంగా మారిందని, కాంగ్రెస్‌ను దించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. బెంగళూరు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులివ్వడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఆరోపించారు. డీకే వ్యాఖ్యలను ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ టీవీ మోహన్‌దాస్ సైతం తప్పుపట్టారు. వైఫల్యాన్ని అంగీకరించడం ఆశ్చర్యం కలిగించిందని, ఇది నాయకత్వ వైఫల్యమని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# మరింత పెరగనున్న సిగరెట్ ధరలు!

## జీఎస్టీ 40 శాతానికి పెంపు!

న్యూఢిల్లీ: ధూమపాన ప్రియులకు చేదువార్త. త్వరలో సిగరెట్ల ధరలు పెరిగే అవకాశం ఉంది. పన్ను ఆదాయం తగ్గకుండా చూడటానికి కేంద్రం సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీని పెంచాలని యోచిస్తున్నది. ప్రస్తుతం జీఎస్టీ 28 శాతం, ఇతర చార్జీలతో కలిపి వీటిపై 52 శాతం పన్నులు విధిస్తున్నారు. త్వరలో జీఎస్టీని 40 శాతం చేయడంతో పాటు ఎక్సైజ్ డ్యూటీని ప్రత్యేకంగా విధించాలని కేంద్రం భావిస్తున్నది. సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై విధించే పరిహార సెస్ గడువు 2026 మార్చితో ముగుస్తున్నది. ఒక వేళ అది లేకపోయినా పన్ను ఆదాయం తగ్గకుండా ముందుగానే జీఎస్టీని పెంచుతున్నారు. సాధారణంగా సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి కాబట్టి వాటిని 'పాపపు వస్తువులు' క్యాటగిరీలో చేర్చారు. దీంతో వీటిపై ప్రాథమిక ఎక్సైజ్ డ్యూటీ, జాతీయ విపత్తుల కంటింజెంట్ డ్యూటీలను కూడా విధిస్తారు.

# నన్ను తేలిగ్గా తీసుకోవద్దు

- *2022లో ప్రభుత్వాన్ని పడగొట్టా*
- *ఫడ్నవీస్‌తో విభేదాల నేపథ్యంలో ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు*



*ముంబై, ఫిబ్రవరి 21: మహారాష్ట్రలోని అధికార మహాయుతి కూటమిలో విభేదాలు ముదిరాయన్న ఊహాగానాలు వినిపిస్తున్న వేళ ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, శివసేన అధినేత ఏక్‌నాథ్‌షిండే కీలక వ్యాఖ్యలు చేశారు. తనను తేలికగా తీసుకోవద్దని హెచ్చరించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నిర్వహిస్తున్న సమావేశాలకు ఇటీవల దూరంగా ఉంటున్న షిండే.. 2022లో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) ప్రభుత్వం పతనమైన విషయాన్ని గుర్తుచేశారు. అప్పట్లో తనను తేలిగ్గా తీసుకోవడం వల్లే ఆ ప్రభుత్వాన్ని కూల్చివేసినట్టు చెప్పారు. తాను బాలా సాహెబ్ కార్యకర్తనన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని, గతంలో తనను తేలిగ్గా తీసుకోవడం వల్లనే ఎంవీఏ ప్రభుత్వాన్ని గద్దెదింపానని విలేకర్లతో అన్నారు. 40 మంది ఎమ్మెల్యేలతో శివసేనను చీల్చి ఎంవీఏ ప్రభుత్వాన్ని కూల్చేసిన షిండే.. బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.*

# నా వల్లే వాజ్‌పేయి సర్కార్ పతనం: పవార్

*న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: కేవలం ఒకే ఒక్క ఓటుతో 1999లో నాటి వాజ్‌పేయి ప్రభుత్వం కూలిపోవడానికి ముందు జరిగిన రహస్య మంతనాల గురించి ఎన్సీపీ(శరద్ పవార్) అధినేత శరద్ పవార్ తొలిసారి నోరు విప్పారు. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగడానికి 8-10 నిమిషాల ముందు సభ వెలుపల జరిగిన మంతనాల కారణంగా అధికార ఎన్డీఏ కూటమికి చెందిన ఒక ఓటు ప్రతిపక్షానికి అనుకూలంగా పడిందని, దీని వెనుక తన పాత్ర ఉందని పవార్ వెల్లడించారు. ప్రతిపక్షానికి అనుకూలంగా తానే ఆ ఒక్క ఓటును తీసుకువచ్చానని, అయితే దాన్ని ఎలా సాధించానన్న విషయాన్ని మాత్రం వెల్లడించబోనని పవార్ అన్నారు. ఢిల్లీలో ఒక మరాఠీ పుస్తకావిష్కరణలో ఆయన 1999 నాటి ఉదంతాన్ని గుర్తు చేసుకున్నారు.*



# మొసలితో కర్ణాటక రైతుల ఆందోళన

## రాత్రివేళ కరెంటుపై నిరసన

కలబురగి: వ్యవసాయానికి రాత్రివేళ కరెంటు సరఫరా చేయడంపై కర్ణాటక రైతులు ఆందోళనకు దిగారు. పొలాల్లో తారసపడ్డ మొసలిని విద్యుత్తు కార్యాలయానికి తీసుకెళ్లి నిరసన వ్యక్తం చేశారు. తద్వారా తాము ఎంతటి ప్రమాదకరమైన పరిస్థితుల్లో వ్యవసాయం చేస్తున్నామో పాలకులకు, అధికారులకు తెలియజేశారు. ఈ ఘటన కలబురగి జిల్లా అఫ్జల్‌పుర్ తాలూకాలోని గొబ్బుర్ (బీ) గ్రామంలో గురువారం జరిగింది. గొబ్బుర్ గ్రామానికి చెందిన రైతు లక్ష్మణ్ పూజారి తెల్లవారుజామున భీమా నది సమీపంలోని పొలానికి నీరు పారించేందుకు వెళ్లగా అతనికి మొసలి తారసపడింది. ఇతర రైతుల సాయంతో దాన్ని తాళ్లతో బంధించి, దగ్గర్లోని గుల్బర్గా ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ లిమిటెడ్ (జెస్కమ్) కార్యాలయానికి తీసుకెళ్లి ఆందోళన చేశారు. రాత్రి పూట పొలాలకు వెళ్లడం వల్ల తాము పాముకాట్లకు గురవుతున్నామని, మొసళ్లు తమపై దాడి చేస్తున్నాయని, ఉదయం 6 గంటల తర్వాత కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ రైతులకు నచ్చజెప్పి మొసలిని అటవీ అధికారులకు అప్పజెప్పారు. వారు దాన్ని కలబురగిలోని మినీ జూకు తరలించారు.

## మంచుపై లావా సెగలు



*చల్లదనానికి ప్రతీక మంచు అయితే.. వేడికి ప్రతిరూపం నిప్పు. అయితే ఈ రెండూ కలిసి ప్రయాణించిన అపురూప దృశ్యం ఇటలీ ప్రావిన్స్ సిసిలీ తూర్పు తీరానికి సమీపంలోని మౌంట్ ఎట్నా అగ్నిపర్వతంపై ఆవిష్కృతమైంది. యూరప్‌లోనే ఎత్తయిన ఈ అగ్నిపర్వతం ఈ నెలలో బద్దలైంది. బొక్కనువా బిలం నుంచి లావా విస్ఫోటం సంభవించింది. అప్పటికే మంచుతో కప్పబడిన శిఖరం నుంచి లావా కిందకు ప్రవహించింది. ఈ అరుదైన, ఆకర్షణీయమైన దృశ్యం ఇప్పుడు సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది.*

# టైమ్ 'విమెన్ ఆఫ్ ది ఇయర్' జాబితాలో భారత మహిళ



న్యూయార్క్, ఫిబ్రవరి 21: మెరుగైన సమాజం కోసం కృషి చేస్తున్న అసాధారణ నాయకులను గౌరవించేందుకు టైమ్ మ్యాగజైన్ ఈ ఏడాది ఎంపిక చేసిన 'విమెన్ ఆఫ్ ది ఇయర్-2025' జాబితాలో భారతీయ జీవ శాస్త్రవేత్త, వన్యప్రాణి సంరక్షకురాలు పూర్ణిమా దేవి బర్మన్ ఉన్నారు. 13 మంది మహిళలతో టైమ్ మ్యాగజైన్ ఈ జాబితా రూపొందించగా, అందులో పూర్ణిమాదేవి ఒక్కరే భారతీయ మహిళ కావడం విశేషం. అస్సాంలో గ్రేటర్ అడ్జుటంట్ అనే జాతి కొంగల సంరక్షణకు పూర్ణిమ ఎంతో కృషి చేశారు.



# చైనాలో కొవిడ్ తరహా కొత్త వైరస్

## గబ్బిలాల్లో గుర్తించిన పరిశోధకులు.. మనుషులకూ వ్యాపించగలదని ప్రకటన

బీజింగ్, ఫిబ్రవరి 21: చైనాకు చెందిన పరిశోధకులు ఓ కొత్త రకమైన కరోనా వైరస్‌ను గుర్తించారు. గబ్బిలాల్లో గుర్తించిన ఈ కొత్త వైరస్‌ను హెచ్‌కేయూ5-కోవ్-2గా పిలుస్తున్నారు. కొవిడ్-19కు కారణమైన సార్స్-కోవ్-2ను ఈ వైరస్ పోలి ఉందని, మనుషులకు సైతం ఇది సోకగలదని తేల్చారు. గబ్బిలాల్లో వైరస్‌లపై అధ్యయనాలతో 'బ్యాట్‌వుమన్'గా ప్రాచుర్యం పొందిన షి జెంగ్లీ అనే వైరాలజిస్ట్ నేతృత్వంలోని పరిశోధకులు ఈ వైరస్‌ను గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు 'సెల్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ వైరస్ మెర్బెకోవైరస్ ఉప రకానికి చెందినదని, ఇందులో మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్(మెర్స్) వైరస్ కూడా ఉందని పరిశోధకులు తెలిపారు. ఇది హాంకాంగ్‌లోని జపనీస్ పిపిస్ట్రెల్ గబ్బిలాల్లో మొదటిసారి గుర్తించిన హెచ్‌కేయూ5 కరోనా వైరస్ శ్రేణికి చెందినదని చెప్పారు. ఈ వైరస్ మనుషులకు నేరుగా లేదా ఇతర జీవాల ద్వారా సోకే ముప్పు ఉందని హెచ్చరించారు. అయితే, కొవిడ్-19కు కారణమైన సార్స్-కోవ్-2 కంటే దీని ప్రభావం తక్కువే ఉంటుందని వెల్లడించారు.